క్లుప్తంగా

ఆర్‌బీకేల సేవలను వినియోగించుకోవాలి

పాలకొండ రూరల్: ప్రస్తుత రబీ సీజన్‌లో సేద్యం చేపడుతున్న రైతులు గ్రామ స్థాయిలో అందుబాట్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల సేవలు అందిపుచ్చుకోవాలని వ్యవసాయాధికారిణి ఎన్ని వాహిని అన్నారు. లుంబూరు ఆర్‌బీకేను గురువారం సందర్శించారు. పంటలు వేయదలచిన రైతులు తమ భూముల సారం తెలుసుకునేందుకు మట్టి పరీక్షలు చేయించటం మేలన్నారు. ఆసక్తి గల రైతులు ఆర్‌బీకేలను సంప్రదించాలన్నారు. ప్రస్తుతం రైతులు పండిస్తున్న పంటలకు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. గ్రామీణ వ్యవసాయ సహాయకులు అన్నదాతల్లో అవగాహన పెంచేలా వారికి అందుబాట్లో ఉండాలన్నారు.

నేడు రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన

జియ్యమ్మవలస: మండలంలోని అలమండ పంచాయతీ చినతోలుమండ, అర్నాడ పంచాయతీ అర్నాడ గ్రామానికి రహదారి నిర్మాణానికి కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శుక్రవారం ఉదయం 10 గంటలకు శంకుస్థాపన చేయనున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు తెలిపారు. కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కలెక్టర్ దృష్టికి పింఛన్ల సమస్య

జియ్యమ్మవలస: మండలంలోని పీటీ మండ పంచాయతీ పరిధి పల్లపుసిరిపి గ్రామానికి చెందిన 29 మంది వృద్ధులకు జనవరి నెల పింఛన్ అందలేదు. వలంటీర్ తప్పిదం లబ్ధిదారులకు శాపంగా మారింది. ప్రతినెలా పింఛన్ పంపిణీ తరువాత డేటాను సింక్ చేయాలి. అలా అయితే తరువాత నెల పింఛన్ లబ్ధిదారుల పేర్లు డిస్‌ప్లే అవుతాయి. వలంటీర్ మాత్రం జనవరి నెల పింఛన్ ఇవ్వకపోవడమే కాకుండా డేటాను సింక్ చేయలేదు. దీంతో ఫిబ్రవరి నెలలో కూడా పింఛన్ల జాబితాలో వారి పేర్లు కనిపించలేదు. పింఛన్ సమస్యను ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లగా వలంటీర్ తప్పిదమే దీనికి కారణమని, సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. రెండు, మూడు రోజుల్లో పింఛన్లు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు.

వసతులు తప్పనిసరి

• ఆర్డీఓ హేమలత



మిర్తివలసలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ హేమలత, అధికారులు

బలిజిపేట: మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద తప్పనిసరిగా వసతులు కల్పించాలని ఆర్డీఓ హేమలత అన్నారు. మండలంలోని బడేవలస, బర్లి, మిర్తివలస, పెదపెంకి, జనార్దనపురం, తదితర పోలింగ్ కేంద్రాలను గురువారం ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ర్యాంప్ సదుపాయం కల్పించాలని ఆదేశించారు. గదుల్లో ఫ్యాన్లు, ఫర్నీచర్, తదితర సదుపాయాలుండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 సామల సింహాచలం, డీటీ రత్నకుమారి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తివిద్య, నైపుణ్యాలపై క్షేత్ర ప్రదర్శన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

బలిజిపేట: వృత్తివిద్య, నైపుణ్యాలలో భాగంగా బలిజిపేట ఉన్నత పాఠశాలలో 9,10 తరగతులు చదువుతున్న 120 మంది విద్యార్థులకు గురువారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. చిలకలపల్లి సబ్‌స్టేషన్‌ను విద్యార్థులు సందర్శించగా.. సిబ్బంది విధులు, సబ్‌స్టేషన్ నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వృత్తివిద్య ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ..



మంగమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పరీక్షిత్‌రాజు

విజయనగరం అర్బన్: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు మాతృమూర్తి మంగమ్మ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో అరకు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం పరామర్శించారు. ఆయనతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు మంగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహిళా పక్షపాతి జగనన్న

• ఎమ్మెల్యే కళావతి
• వేడుకగా వైఎస్సార్ ఆసరా సంబరాలు



మహిళలకు ఆసరా చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి అని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు మహిళల అభ్యున్నతికి నిరంతరం పాటుపడుతున్నారని పేర్కొన్నారు. భామినిలో వెలుగు ఏపీఎం దొడ్ల భవానీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కళావతి నాల్గో విడత ఆసరా నిధులు రూ.3కోట్ల 72 లక్షల 5వేల 851ల చెక్కును మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. మండలంలో 702 సంఘాల పరిధిలో 9461 మంది సభ్యులకు ఆసరా నిధులు విడుదలైనట్టు వెలుగు ఏపీడీ ఆర్‌వీ రమణ వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పాటుపడుతున్నారన్నారు. జగనన్న ఇచ్చిన అవకాశంతోనే 50 శాతం మహిళా రిజర్వేషన్లతో పదవులు పొందామని ఎమ్మెల్యే వివరించారు. వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి పథకాలతో ఆర్థిక సమస్యలు తీరి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. వైఎస్సార్ ఆసరాతో రుణమాఫీ చేసి మహిళల ఆర్థిక పరపతి పెంచి గౌరవం పెంచారన్నారు. ఈ సందర్భంగా సంబరాల్లో పాల్గొన్న మహిళల సీఎం జగన్ పాటకు నృత్యాలు చేసి అలరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థినులు థింసా నృత్యాలు చేసి అలరించారు. పార్టీ నాయకులు తోట సింహాచలం, టింగ అన్నాజీరావు, బోనగడ్డి ధర్మారావు, మేడిబోయిన శ్రీవేణి, ఎంపీటీసీ బిడ్డిక తులసీ, సర్పంచ్ ఎరుకుమజ్జి పద్మావతి, ఎంఎంఎస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



భామిని: బాలేరులో పింఛన్ అందజేస్తున్న వలంటీరు తిరుపతిరావు



పాలకొండ రూరల్: శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో సూరమ్మ నుంచి వేలి ముద్రను సేకరిస్తున్న వలంటీరు రమణ



గుమ్మలక్ష్మీపురంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు

ఠంచన్‌గా పింఛన్

వైఎస్సార్ పింఛన్ కానుకను వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు గురువారం వెళ్లి అందజేశారు. ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్ అందడంతో లబ్ధిదారుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. జగన్ బాబు చల్లగా ఉండాలని.. పది కాలాల పాటు ఆయనే ముఖ్యమంత్రిగా ఉండాలని ఆకాంక్షించారు. ఇంటికి పెద్ద కొడుకులాగా తమ బాధ్యతలను ముఖ్యమంత్రి తీసుకున్నారని కృతజ్ఞతలు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



గుమ్మలక్ష్మీపురం: కేదారిపురంలో వృద్ధులకు పింఛను నగదు అందజేస్తున్న వలంటీరు

ఇంటింటా జగనన్న సంక్షేమ ఫలాలు



కీసరలో సంక్షేమ పథకాల జాబితాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

• 'గడప గడపలో..' ఎమ్మెల్యే కళావతి

భామిని: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలాలు ఇంటింటా అందుతున్నాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని కీసరలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి అందుతున్న పథకాలపై ఆరా తీశారు. వ్యక్తిగత సమస్యలపై ఆరా తీశారు. పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. పార్టీ నాయకులు తోట సింహాచలం, బోనగడ్డి ధర్మారావు, బొడ్డేపల్లి ప్రసాదరావు, చెంగల ఫల్గుణరావు, ఒమ్మి మోహనరావు, కొత్తకోట చంద్రశేఖర్, గెల్లంకి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆశలపై మంచు పొరలు



మంచుకు గురైన మిరప పంట



మంచుకారణంగా పూత రాలిపోతున్న మామిడి

గరుగుబిల్లి: మంచు దెబ్బకు రైతులు విలవిలలాడుతున్నారు. పంటలపై రైతులు పెట్టుకొన్న ఆశలను మంచు దెబ్బతీస్తోంది. కొద్ది రోజుల నుంచి కురుస్తున్న తేనే మంచు రైతులకు అపార నష్టం కలిగిస్తోంది. మంచు ప్రభావం అన్ని పంటలపై చూపిస్తోంది. రైతులు సాగు చేస్తున్న జీడి, మామిడి, ఉల్లి, మిరప పంటలపై మంచు ప్రభావం ఎక్కువగా వుంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, గొట్టివలస, ఉల్లిబద్ర, సుంకి తదితర గ్రామాలలో 850 హెక్టారులలో జీడి, 560హెక్టారులలో మామిడి, 30 ఎకరాలలో ఉల్లి, మిరప తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. మంచు కారణంగా పూత రాలిపోవడం, రసంపీల్చు పురుగులు ఆశించడం, కుళ్లు తెగులు, పేనుబంక పురుగులు ఆశిస్తున్నట్టు రైతులు పేర్కొంటున్నారు. తెగులు ప్రభావంతో పూతలు రాలిపోతున్నాయని జీడి, మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉల్లి పంటకు కుళ్లు తెగులు, మిరపకు ముడసర తెగులు వ్యాపిస్తున్నాయి. వాతావరణం అనుకూలించక పోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

పాలకొండ: బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ పి.సోమేశ్వరరావును కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు గురువారం ఘనంగా సన్మానించారు. ఇక్కడ నాలుగేళ్ల పాటు విధులు నిర్వహించిన సోమేశ్వరరావుకు అరకు బదిలీ అయింది. ఈ మేరకు ఆయన ఇక్కడ విధుల నుంచి రిలీవ్ కావడంతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు కొనియాడారు. ఉప తహసీల్దార్ బి.బుచ్చయ్య, మండల సర్వేయర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

ఎంపీడీఓగా పైడితల్లి

పాలకొండ: మండల అభివృద్ధి అధికారిణిగా పైడితల్లిని ప్రభుత్వం నియమించింది. ఇక్కడ ఇంతవరకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా పని చేసిన త్రినాథ స్థానంలో గరుగుబిల్లి ఎంపీడీఓగా పని చేస్తున్న పైడితల్లిని ఇక్కడకు బదిలీ చేశారు. శుక్రవారం ఆమె విధుల్లో చేరనున్నారు.

పశువులకు వ్యాక్సినేషన్



పశువులకు పరీక్షలు చేస్తున్న పశువైద్య సిబ్బంది

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో పశువులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. గ్రామీణ పశు సహాయకులు వెంకటరమణ ఆధ్వర్యంలో పశువులకు తనిఖీలు నిర్వహించి మందులు అందించారు. ఈ సందర్భంగా ఆయన చూడి పశువుల విషయంలో పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. దాణాతో పాటుగా పచ్చిమేత అందించాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు రాకుండా మందులు వేశారు.

వీరఘట్టంలో వైఎస్సార్ ఆసరా సంబరాలు రేపు

వీరఘట్టం: వీరఘట్టం వెలుగు కార్యాలయం ఆవరణలో వైఎస్సార్ ఆసరా సంబరాలు ఈ నెల 3న నిర్వహించనున్నట్టు ఏపీఎం బి.శివున్నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ చేపట్టనున్నట్లు తెలిపారు. డ్వాక్రా సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కష్టమర్లకు చెల్లింపులు చేయాలి..

పార్వతీపురం: సహారా ఇండియా కష్టమర్లకు డిపాజిట్ సొమ్మును వెంటనే చెల్లించాలని కోరుతూ ఫీల్డ్ సిబ్బంది, ఖాతాదారులు గురువారం స్థానిక సహారా కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సెబికి, సహారా మధ్య నెలకొన్న సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. ఆందోళనలో యూనియన్ నాయకులు ఎ.శ్రీనుబాబు, రమణ, సర్వేశ్వరరావు, శేఖరరావు, తదితరులు పాల్గొన్నారు.

దేవనాపురం అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

సీతంపేట: మండలంలోని దేవనాపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీఓ పి.రంగలక్ష్మి గురువారం సందర్శించారు. ఈ సెంటర్ నుంచి సరుకుల పంపిణీలో జాప్యం జరుగుతుందని, ఎలుకలు కొట్టేసినవి ఇస్తున్నారని బుధవారం సీతంపేటలో జరిగిన మండల సమావేశంలో వైస్ ఎంపీపీ ఎం.విజయలక్ష్మి ఆరోపించారు. దీనికి స్పందించిన సీడీపీఓ కేంద్రానికి వెళ్లి విచారణ చేశారు. వైస్ ఎంపీపీ సమక్షంలో లబ్ధిదారులతో మాట్లాడారు. అందరికీ సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని ఎప్పటి స్టాక్ అప్పుడు లబ్ధిదారులకు అందజేయాలని సిబ్బందికి సూచించారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీడీపీఓ రంగలక్ష్మి

'భోజనం' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీతంపేట: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీతంపేట ఎంఈఓ ఆనందరావుకు సీఐటీయూ ఆధ్వర్యంలో వంట కార్మికులు వినతిపత్రం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమణారావు మాట్లాడుతూ నెలకు రూ.10 వేలు వేతనం 5వ తేదీలోపు చెల్లించాలన్నారు. మెనూ చార్జీలు రూ.20 చెల్లించాలన్నారు. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించవద్దని కోరారు. వంట చేసినపుడు అగ్ని ప్రమాదానికి గురైతే నష్టపరిహారం చెల్లించాలన్నారు. పై సమస్యలు పరిష్కరించకపోతే దశలవారీ ఆందోళన తప్పదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉషా, రోయిబారి పాల్గొన్నారు.



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సీతంపేటలో..

సీతంపేట: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీతంపేట ఎంఈఓ ఆనందరావుకు సీఐటీయూ ఆధ్వర్యంలో వంట కార్మికులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమణారావు మాట్లాడుతూ భోజన కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు ఉషా, రోయిబారి తదితరులు పాల్గొన్నారు.

కులగణనలో పొరపాట్లు ఉంటే సరిచేసుకోండి

వీరఘట్టం: ఇటీవల గ్రామాల్లో చేపట్టిన కులగణన సర్వేలో ఏమైనా పొరపాట్లు చేసి ఉంటే వాటిని సరిదిద్దుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ సూచించారు. నడిమికెల్ల సచివాలయాన్ని ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు ఇతర సిబ్బంది తమ లాగిన్‌లో చేపట్టిన సర్వేలో తప్పులు ఉంటే ఆ వివరాలు తనకు తెలియజేస్తే మరలా మీ లాగిన్‌కు ఆ కుటుంబ వివరాలు పంపించేందుకు తనకు కుదురుతుందని డీపీఓ తెలిపారు. అందుచేత ఎవరైనా ఇటువంటివి చేసి ఉంటే తెలియజేయాలని కోరారు. ఆయనతో పాటు నడిమికెల్ల పంచాయతీ కార్యదర్శి బి.కోటీశ్వరరావు ఉన్నారు.



కులగణనన సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ సత్యనారాయణ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కురుపాం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ స్తంభాల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు ఆ శాఖ డీఈ వీవీ కిశోర్ గురువారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

పేదలకు దుస్తుల పంపిణీ

పాలకొండ రూరల్: దైవజనుడైన క్రీస్తు వాక్కు మేరకు ప్రతి ఒక్కరూ తోటి వారి పట్ల ప్రేమను కలిగి ఉండాలని పట్టణానికి చెందిన షారోణు ప్రార్థనా మందిరం నిర్వాహకులు ఎస్.యేసురత్న రాజ్‌కుమార్ అన్నారు. కొత్తవీధిలో ఉన్న శ్రీహల సంగీతరావు సత్యవేదం చారిటబుల్ ట్రస్టు వార్షికోత్సవంలో భాగంగా పేదలకు వస్త్రదానం చేపట్టారు. ట్రస్టు ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమం ద్వారా నిర్వాహకులు మాట్లాడుతూ నిత్య అన్నదానం ప్రారంభించి ఎందరో పేదలకు ఆహారం అందించటం దేవుని కృపగా పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల, పట్టణానికి చెందిన వివిధ క్రైస్తవ సంఘాల నిర్వాహకులు హాజరయ్యారు.



పేదలకు వస్త్రాల అందజేత

దేవుడి మార్గం అనుసరణీయం

పాలకొండ రూరల్: భగవంతుడు జీవుల శ్రేయస్సుకై చూపిన మార్గం అనుసరణీయమని ఆధ్యాత్మిక వక్త ఎస్‌వీ రమణ అన్నారు. మండలంలోని పనుకువలస రామసాయి మందిరంలో గీతా పారాయణం, సత్‌సంఘ కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు శ్రీకృష్ణుడు గీతలో సూచించిన 18 అధ్యాయాల విశిష్టత, అందులో దాగి ఉన్న జీవన సారాంశాన్ని వివరించారు. ఆధ్యాత్మిక బోధనకై ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వక్తలను సన్మానించారు. కార్యక్రమంలో సామంతుల దామెదరరావు, ఇప్పిలి తవిటిరాజు, ఎస్.చిన్నారావు, ఎం.మోహన్‌దాస్ తదితరులు గీతా పారాయణం చేశారు.



రామసాయి మందిరంలో ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న వక్తలు

ట్రాన్స్‌జెండర్స్‌కు గుర్తింపు కార్డుల పంపిణీ

కురుపాం: ట్రాన్స్‌జెండర్స్ గుర్తింపు కార్డులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో నీ తోడు సొసైటీ ఆధ్వర్యంలో కురుపాం నియోజకవర్గంలో 60 మంది ట్రాన్స్‌జెండర్స్‌కు గురువారం గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి మాట్లాడుతూ గుర్తింపు కార్డులను ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ కవిత మాట్లాడుతూ గుర్తింపు కార్డుల ఉన్న ప్రతీ ఒక్కరు ప్రభుత్వ సంక్షేమ పథకాలైన పెన్షన్లకు, పక్కా ఇళ్లకు దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గార్ల సుజాత, ఎంపీడీఓ అప్పారావు, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, ఎంపీటీసీ వెలమల బంగారునాయుడు, నీ తోడు సొసైటీ అధ్యక్షుడు సిస్టర్ అమిత, ట్రాన్స్ జెండర్స్ యూనియన్ నాయకులు కొండబాబు, నియోజకవర్గంలోని హిజ్రాలు పాల్గొన్నారు.



ట్రాన్స్‌జెండర్స్‌కు గుర్తింపు కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ నృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వెలిసిన లక్ష్మీ నృసింహస్వామి గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న నృసింహస్వామికి అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.